సాక్షి తిరుపతి

శుక్రవారం । 14 । జూలై । 2023



నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ

టీటీడీ స్థానికాలయాల్లో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు యోచిస్తున్నట్టు టీటీడీ చైర్మన్‌ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. - IIలో



బాబు దుర్మార్గ పాలన

చంద్రబాబు దుర్మార్గపు పాలనను తిరిగి ప్రజలు కోరుకోవడం లేదని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	35	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్‌

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,664 మంది స్వామివారిని దర్శించుకోగా.. 32,336 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైం స్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

17న శ్రీవారి ఆలయంలో బ్రేక్‌ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 17న సాలకట్ల ఆణివార ఆస్థానం నేపథ్యంలో బ్రేక్‌ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా జూలై 16న ఆదివారం ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబడవని, ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరింది.

నేడు ప్రయివేటు డిగ్రీ కళాశాలల బంద్‌

తిరుపతి ఎడ్యుకేషన్‌: రాష్ట్ర ఉన్నత విద్య నియంత్రణ, పరిశీలన కమిషన్‌ (ఏపీహెచ్‌ఈఆర్‌ఎం) నిర్ణయించిన ఫీజులు సమంజసంగా లేవని, దీనికి నిరసనగా శుక్రవారం ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రయివేటు డిగ్రీ కళాశాలలు ఒక రోజు బంద్‌ నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్వీయూ ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.శేషారెడ్డి, ఎం.సురేంద్రారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపకరణాల పంపిణీ రేపు

తిరుపతి అర్బన్‌: హైదరాబాద్‌కు చెందిన ఏఎల్‌ఐఎంసీవో సంస్థ సహకారంతో తిరుపతిలోని యూత్‌ హాస్టల్‌లో ఈనెల 15న జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు ఆ సంస్థ సహాయ సంచాలకులు శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపకరణాలను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. రసీదుతోపాటు సదరమ్‌ సర్టిఫికెట్‌, ఆధార్‌, రేషన్‌కార్డు, పాస్‌ ఫొటో సైజ్‌ రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

చర్చాగోష్టి

తిరుపతి ఎడ్యుకేషన్‌ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం (ఎన్‌ఎస్‌యూ)లో నిర్వహిస్తున్న జాతీయ సంస్కృత సమ్మేళనంలో భాగంగా రెండో రోజు సంస్కృతం, కంప్యూటర్‌ సైన్స్‌, హెల్త్‌ సైన్స్‌, యోగా తదితర అంశాల్లో చర్చాగోష్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ జీఎస్‌ఆర్‌.కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ టెక్నాలజీకి సంస్కృతమే మూలమని, కొన్ని వేల సంవత్సరాల పూర్వమే కంప్యూటర్‌కు సంబంధించిన మేథోసంపత్తి (ఇంటలిజెన్స్‌)కి మన రుషులు ఎంతో దూరదృష్టితో వివరించినట్లు తెలిపారు. అనంతరం వక్తలను వీసీ ఘనంగా సత్కరించారు.

కోర్టులో అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగాలు

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు, తిరుపతిలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను అవుట్‌ సోర్సింగ్‌ పద్ధతిలో భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి అధికారిణి పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్‌ కమ్‌ అసిస్టెంట్‌-4, జూనియర్‌ అసిస్టెంట్‌ -1, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ -1, స్టెనో-1, రికార్డ్‌ అసిస్టెంట్‌ -2, అటెండర్‌-7, ఆఫీస్‌ సబార్డినేట్‌ -1 పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరులోని ఉపాధి కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తామని, ఈనెల 22వ తేదీలోపు కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

అర్చకులు పేర్లు నమోదు చేసుకోవాలి

చిత్తూరు రూరల్‌: దేవదాయశాఖలో పనిచేస్తున్న అర్చకులు 43 రిజిస్టర్‌, వంశపారంపర్య అర్చకుల గుర్తింపునకు పేర్లు నమోదు చేసుకోవాలని శాఖ జిల్లా సహాయ కమిషనర్‌ ఏకాంబరం తెలిపారు. 6ఏలో పనిచేస్తున్న అర్చకులు తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్‌కు, 6బీలో పనిచేస్తున్న అర్చకులు కర్నూలులోని ఉప కమిషనర్‌కు, 6సీలోని ఆలయ అర్చకులు చిత్తూరు సహాయ కమిషనర్‌ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని గమనించి వారంలోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు.


తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

తిరుపతి అర్బన్‌: మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ధరలను అదుపు చేయాలని జేసీ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన రైస్‌మిల్లర్లు, ట్రేడర్లతో సమీక్షించారు. బియ్యం, కంది పప్పు ధరలు మార్కెట్‌ ధరకంటే 15 శాతం తక్కువకు విక్రయించాలని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీరు, మార్కెటింగ్‌ ఏడీ సురేంద్ర, ఏఎస్‌ఓ రెడ్డిచంద్రిక పాల్గొన్నారు.

దీవించు 'మామ'!

భూమీమ్మద నివసించే అందరూ చందమామను ముద్దుగా మామ అని పిలుచుకుంటారు. చంద్రుడికి పురాణాలు, ఇతిహాసాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించారు. ప్రతి పౌర్ణమి రోజున ఎంతో అందంగా కనిపించే చంద్రుడి గర్భంలో దాగి ఉన్న విశేషాలు, వింతలను తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. గడిచిన 60 ఏళ్లలో అనేక రకాల పరిశోధనలు చేయగా.. అందులో కొన్ని విజయవంతంకాగా.. మరికొన్ని విఫలమయ్యాయి. భారత్‌ శాస్త్రవేత్తలు మొదటి ప్రయత్నంలోనే విజయబావుటా ఎగురవేసి ప్రపంచపటంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ద్వితీయార్థంలో ఎదురైన సవాళ్లను అధిగమించి మూడో ప్రయోగానికి సిద్ధమయ్యారు. నేడు చేపట్టనున్న చంద్రయాన్‌-3 విజయవంతమయ్యే విధంగా నెలరాజు దీవించాలని భారతీయులు కోరుతున్నారు.

- నేడు చంద్రయాన్‌ -3 ప్రయోగం
- జాబిల్లిపై రహస్యాలు తెలుసుకోవడమే లక్ష్యం
- చంద్రయాన్‌ సిరీస్‌లో ఇది మూడో ప్రయోగం



నింగివైపు ఎక్కుపెట్టిన చంద్రయాన్‌-3 (ఇన్‌సెట్‌) చంద్రుడిపై దిగనున్న ల్యాండర్‌

సూళ్లూరుపేట: ప్రకృతిలో వస్తున్న మార్పులకారణంగా చందమామ విస్తీర్ణం తగ్గుతూ వస్తోందని, చంద్రుని చుట్టు కొలత విస్తీర్ణం 10,921 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉందని నాసా శాస్త్రవేత్తలు గతంలోనే గుర్తించారు. చంద్రుడు భూమికి దూరంగా జరిగి వెళుతున్నాడని, ఏడాదికి సుమారు 15 అంగుళాల దూరం వెళుతున్నాడని కూడా వెల్లడించారు. వీటన్నింటినీ పరిశోధన చేయడానికి ఎన్నో దేశాల శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. భారత్‌ శాస్త్రవేత్తలు 2008లో చంద్రయాన్‌-1 ప్రయోగంలో ఆర్బిటర్‌ అనే ఉపగ్రహాన్ని చంద్రుడి చుట్టూర పరిభ్రమించేలా చేసి చంద్రుడికి రెండోవైపున నీటి జాడలున్నాయని కనుగొన్నారు. చంద్రయాన్‌-1లో అమర్చిన 'మూన్‌ ఇంపాక్ట్‌ ప్రోబ్‌' అనే పేలోడ్‌ చంద్రునిపై నీటి జాడలున్నాయని ఛాయాచిత్రాలను కూడా తీసి పంపించింది. 2019లో ప్రయోగించిన చంద్రయాన్‌-2లో ల్యాండర్‌, రోవర్‌ ఆఖరి నిమిషంలో చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొని సిగ్నల్స్‌ ఆగిపోయాయి. కానీ ఆర్బిటర్‌ మాత్రం ఇప్పటికీ చంద్రుని కక్ష్యలోనే పరిభ్రమిస్తోంది. చంద్రుడికి రెండోవైపు నీటి జాడలున్న విషయాన్ని కనుగొనడమే కాకుండా ఆ నీళ్లు పలచగా ఉన్నాయని కూడా తెలియజేసింది. చంద్రయాన్‌-3 ప్రయోగంలో మరిన్ని పరిశోధనలు చేసి అత్యంత విలువైన సమాచారాన్ని సేకరించేందుకు సంకల్పించారు.

చంద్రుడిపై 125 ప్రయోగాలు

ప్రపంచంలోని దేశాలు ఇప్పటికి దాకా 125 ప్రయోగాలు చంద్రుడిపైనే చేశాయని ఐక్యరాజ్యసమితి వెల్లడిస్తోంది. అమెరికా 1958 నుంచి చంద్రుడిపై పరిశోధనలను ప్రారంభించింది. 12 ప్రయోగాలు చేసిన తర్వాత 13వ ప్రయోగంలో చంద్రుని కక్ష్యలోకి చేరుకున్నారు. అమెరికా మొత్తంగా 58 ప్రయోగాలు చేసి అందులో 41 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించింది. 1969లో అపోలో రాకెట్‌ ద్వారా నీల్‌ ఆర్మ్‌స్ట్రాంగ్‌, ఎడ్విన్‌ ఆల్డ్రిన్‌, మైఖేల్‌ పోలీన్స్‌ అనే ముగ్గురు వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించిన ఘనత అమెరికా పేరు మీదే ఉంది. రష్యా 1958 నుంచి 53 ప్రయోగాలు చంద్రునిపై చేయగా.. అందులో 35 విజయవంతమయ్యాయి. 1990 నుంచి జపాన్‌ ఆరు ప్రయోగాలు సొంతంగా, ఒక ప్రయోగం నాసాతో కలిసి చేయగా.. అందులో 5 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. 2010 నుంచి చైనా ఏడు ప్రయోగాలు చేయగా అందులో ఒక్క ప్రయోగాన్ని మాత్రమే చంద్రుని దాకా తీసుకెళ్లగలిగింది. ఇజ్రాయిల్‌ 2019 ఫిబ్రవరిలో చంద్రునిపైకి ల్యాండర్‌ను పంపించినా అది విజయవంతం కాలేదు. జర్మనీ 2003లో చంద్రుని మీదకు ఆర్బిటర్‌ను విజయవంతంగా పంపించింది. 2008లో భారత్‌ చంద్రుడిపైకి చంద్రయాన్‌-1 పేరుతో ఆర్బిటర్‌ ప్రయోగించి మొదటి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకుంది. అమెరికా, రష్యా, జపాన్‌, చైనా, జర్మనీ, ఇజ్రాయిల్‌, భారత్‌ చంద్రుడిపై పరిశోధనలకు ప్రయోగాలు చేసినప్పటికీ అమెరికా, రష్యా లాంటి అగ్రరాజ్యాలు ఇప్పటికీ పోటీపడుతున్నాయి. తాజాగా భారత్‌ కూడా అగ్రరాజ్యాలతో పోటీపడుతూ మూడో సారి ప్రపొల్షన్‌ మాడ్యూల్‌ ద్వారా ల్యాండర్‌ను చంద్రుని ఉపరితలంపై దింపి అందులో అమర్చిన రోవర్‌తో చంద్రుడిపై పరిశోధనలు చేసే స్థాయికి చేరింది. చంద్రుడు, అంగారకుడి మీదకు రోవర్లు పంపిన దేశాలు పెద్ద బాల్స్‌లో రోవర్లను అమర్చి పంపాయి. భారత్‌ మాత్రం ల్యాండర్‌ ద్వారా రోవర్‌ను చందమామపై దించే మొట్టమొదటి దేశంగా ఖ్యాతి గడించనుంది. భవిష్యత్‌లో చంద్రుడిపైకి మానవుడ్ని పంపించేందుకు ఇదే తరహాలోనే చేసే అవకాశం లేకపోలేదు.

చంద్రయాన్‌ ప్రాజెక్టులకు రూ.1,600 కోట్లు

చంద్రయాన్‌-1, చంద్రయాన్‌-2 రెండు ప్రాజెక్టులకు కలిపి రూ.978 కోట్లు వ్యయం చేశారు. చంద్రయాన్‌-3 ప్రయోగానికి సుమారు రూ.615 కోట్లు వ్యయం చేస్తున్నారు. చంద్రయాన్‌-3లో ప్రపొల్షన్‌ మాడ్యూల్‌, ల్యాండర్‌, రోవర్‌లను పంపిస్తున్నారు కాబట్టి దీన్ని త్రీ ఇన్‌ వన్‌ ప్రయోగంగా ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. చంద్రయాన్‌-3 ప్రయోగం విజయవంతం కావాలని యావత్‌ భారతదేశం ఆకాంక్షిస్తోంది.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి



శ్రీవారి చిత్రపటాన్ని కేంద్రమంత్రి నితిన్‌ గడ్కరీకి బహూకరిస్తున్న టీటీడీ చైర్మన్‌ వైవీ.సుబ్బారెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కేంద్ర మంత్రి ముందుగా ధ్వజ స్తంభానికి మొక్కి తర్వాత శ్రీపద్మావతి అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం పలకగా, టీటీడీ చైర్మన్‌ తీర్థ ప్రసాదాలు అందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి

తిరుమల: కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీని గురువారం తిరుమలలోని ఆయన అతిథి గృహంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో జరుగనున్న అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. అనంతరం కేంద్రమంత్రి నితిన్‌ గట్కరికి శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిరూపాన్ని అందజేశారు.



కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి

21న వెంకటగిరికి సీఎం జగన్‌

రాపూరు: వెంకటగిరికి ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారని, ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాపూరు తెలుగుగంగ అతిథిగృహం వద్ద రాపూరు, సైదాపురం, కలువాయి మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న వెంకటగిరిలో చేనేత నేస్తం నిధులను నేత కార్మికుల ఖాతాలో జమ చేసేందుకు ముఖ్యమంత్రి రానున్నారని, సీఎంకు నియోజకవర్గంలో అపూర్వ స్వాగతం పలకాలన్నారు. ముఖ్యమంత్రి అనుమతిస్తే మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహం వెంకటగిరిలో ఏర్పాటు చేసి ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. కొంత మంది వల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వెనుకబడ్డాయని, వాటిని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం గ్రాఫ్‌ పెరిగిందన్నారు. వలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడిన పవన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకముందు వైస్‌ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎంపికైన పోలంరెడ్డి పెంచలరెడ్డిని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సత్కరించారు. సమావేశంలో ఎంపీపీ ప్రసన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్‌ కన్వీనరు దందోలు నారాయణరెడ్డి, రవికుమార్‌యాదవ్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి, సైదాపురం, కలువాయి నాయకులు జనార్దన్‌రాజు, శంకర్‌రాజు, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్‌,ఎస్పీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సభా స్థలి, హెలీప్యాడ్‌, తదితర ప్రదేశాలను కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి గురువారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం, హెలీప్యాడ్‌ ఏర్పాటుకు సంబంధించి రెండుమూడు ప్రదేశాలను పరిశీలించామని, శనివారం జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి, పలువురు ఎమ్మెల్యేలు వెంకటగిరి రానున్నారని, వారు పరిశీలించి సభాస్థలివేదిక ఎంపికపై తుదినిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ నక్కా భానుప్రియ, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చేనేత విభాగం అధ్యక్షుడు కాసుల శివకుమార్‌, పద్మశాలీ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ నక్కా వెంకటేశ్వరరావు, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌, నేతలు ఎల్‌ కోటీశ్వరరావు, చిట్టేటి హరికృష్ణ, కడప బ్రహ్మయ్య, నాగయ్య పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు అవసరం

తిరుపతి ఎడ్యుకేషన్‌: విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు నిత్యజీవితంలో విజయం సాధించేందుకు అవసరమైన జీవన నైపుణ్యాలు అవసరమని తిరుపతి ఉప విద్యాశాఖాధికారి(డీవైఈఓ) ఆనందరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, మ్యాజిక్‌ బస్‌ ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్‌ స్కూల్లో ఏర్పాటుచేసిన మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. తిరుపతి జిల్లా పరిధిలో ఎంపిక చేసిన 50 ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 100 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి డీవైఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మ్యాజిక్‌ బస్‌ ఫౌండేషన్‌తో పాఠశాల విద్యాశాఖ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రాబోవు మూడేళ్లలో 11అంశాలలో జీవన నైపుణ్యాలపై కౌమార దశలోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారని, ప్రస్తుతం జిల్లా స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

మా దేవుడు నువ్వేనయ్యా!



ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నల్లాని బాబు

తిరుపతి మంగళం : దళితుల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న మాదేవుడు నువ్వేన య్యా అంటూ ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు కొనియాడారు. దళితులకు వ్యవసాయ భూమి పంపిణీ చేయాలని క్యాబినెట్‌ సమావేశంలో సీఎం తీసుకున్న నిర్ణయంపై దళితులు హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి డీఆర్‌మహల్‌ వద్ద తిరుపతి జిల్లా ఎస్సీసెల్‌ అధ్యక్షుడు నల్లాని బాబు ఆధ్వర్యంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడు తూ అణగారిన దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఆశ యాలకు అనుగుణంగా దళితులకు అభ్యున్నతి శ్రమిస్తున్నారని కొనియాడారు. ఎస్సీ సెల్‌ రీజనల్‌ కో-ఆర్డినేటర్‌ దేవదానం, తాళ్లూరి ప్రసాద్‌, అంకాలమ్మ గుడి చైర్మన్‌ శెట్టిపల్లి లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జంపాల గాంధీ, గురవయ్య, బుడ్స్‌ శ్రీను, భాను, తేజ, దిలీప్‌, చైతన్య పాల్గొన్నారు.

వేడుకగా పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుపతి కల్చరల్‌: కోదండరామస్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాలతో ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సీతారామ సమేత లక్ష్మణస్వామి ఉత్సవ మూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. అనంతరం శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ పెద్దజీయర్‌ స్వామి, డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, కంకణభట్టార్‌ ఆనంద కుమార్‌ దీక్షితులు, సూపరింటెండెంట్‌ రమేష్‌, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్‌ పాల్గొన్నారు.



హారతి సమర్పిస్తున్న అర్చకులు

పట్టాలు పొందిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్‌ మండలం, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద పట్టాలు పొందిన ప్రతిఒక్క లబ్ధిదారినికి త్వరలోనే స్థలం చూపిస్తామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం తిరుమలనగర్‌కు వచ్చిన ఆయనకు మహిళలు తమకు పట్టాలు ఇచ్చినా స్థలం చూపలేదని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ చిందేపల్లి వద్ద ఇంటి పట్టాలు ఇచ్చిన తర్వాత అక్కడి స్థలం యజమాని పిటిషన్‌ వేశారని, కోర్టు స్టే వల్ల అధికారులు స్థలం చూపలేకపోయారని వివరించారు. అయితే ఇదే విషయంపైన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని జగనన్న లే అవుట్లు (శానంబట్ల, ముంగిలిపట్టు, ఏజీ పల్లి ప్రాంతాలు)లో ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. వీలైనంత త్వరగా ఇంటి పట్టాలు పొందిన వారందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యుత్‌ సరఫరా సరిగా లేదనడంతో అక్కడే ఉన్న విద్యుత్‌ శాఖ ఏఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అవి త్వరగా పూర్తి చేసి మంగళం ప్రజలకు విద్యుత్‌ సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. అడగకుండానే అన్నీ చేస్తున్న తాను ఏమి అడిగినా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మోహిత్‌రెడ్డిని చెవిరెడ్డి బిడ్డగా కంటే మీలో ఒక్కడిగా, మీ బిడ్డగా ఆదరించాలని విజ్ఞప్తి చేయడంతో అక్కడి మహిళలు తప్పకుండా గెలిపిస్తామని చప్పట్లతో తమ మద్దతు తెలిపారు.



ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలోని లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న మేఘాలయ గవర్నర్



అమ్మవారి ఆలయంలో మేఘాలయ గవర్నర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మేఘాలయ గవర్నర్ ఫాఘు చౌహన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, తిరుపతి రూరల్ తహసీల్దార్ వెంకటేశర్లు ఇతర అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ

పాకాల: రోడ్డు పక్కన బస్‌స్టాప్ వద్ద ఆగబోతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం స్థానిక పోలీసుల కథనం.. పెనుమూరు మండలం, గుడిపల్లి బస్‌స్టాప్ వద్ద ఆగి ఉన్న పీలేరు డిపో ఆర్టీసీ బస్సును తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో పీలేరు మండలం, గువ్వల కాలనీకి చెందిన సరోజమ్మ, ఆమె భర్త మారియప్పకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే పెరుమాళ్ల గుడిపల్లికి చెందిన లక్ష్మమ్మ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది హుటాహుటిన పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ ఓబులేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబు దుర్మార్గ పాలనను జనం మరచిపోలేదు

- జగనన్న చేసిన మేలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తుంది
- గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పక్కన డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం : చంద్రబాబు 14ఏళ్ల పాటు పాలించిన దుర్మార్గపు పాలనను తిరిగి ప్రజలు కోరుకోవడం లేదని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. గురువారం తిరుపతి 6వ డివిజన్ సుభాష్‌నగర్‌లో ఆ డివిజన్ కార్పొరేటర్ కేతం జానకి, అధ్యక్షుడు నాదమునిరెడ్డి, బాలాజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు హారతులతో ఆత్మీయ స్వాగతం కలికారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ, 14ఏళ్ల పాటు ముఖ్యమంత్రిని అని చెప్పుకునే చంద్రబాబు ఏనాడైనా ప్రజలకు చిన్నపాటి మేలు చేశాడా? అని ప్రశ్నించారు. ధనవంతులకు కొమ్ముకాయడం తప్ప పేదల సంక్షేమం కోసం ఏనాడైనా ఆలోచించి ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేశారా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టీడీపీకి బుద్ధిచెప్పినా ఇంకా మార్పు రావడం లేదన్నారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టి అబద్ధపు హామీలతో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే నిత్యం ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న సీఎం జగనన్నపై అసత్య ఆరోపణలు చేయడంతో పాటు ఎల్లో మీడియాలో విషపు రాతలు రాయిస్తున్నాడని మండిపడ్డారు.

ఓర్వలేకే విమర్శలు

దేశ రాజకీయ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అందించిన సీఎం జగనన్నను ప్రతి గడప ఆదరిస్తోందని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో జగనన్నకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని ఆరోపించారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనవి కూడా అమలు చేశారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథరెడ్డి, టి.మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, కో–ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి, 7వ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కాసీమ్(చోటాబాయ్), పార్టీ నాయకులు పాముల రమేష్‌రెడ్డి, తలారి రాజేంద్ర, తాలూరి ప్రసాద్, కంకణాల రమేష్, మహ్మద్‌రఫీ, శ్యామల, గీతా యాదవ్ పాల్గొన్నారు.

16 నుంచి ఏడుకొండల నృత్యోత్సవాలు



మాట్లాడుతున్న సురేష్

తిరుపతి కల్చరల్: తిరుమలలోని ఆస్థాన మండపం వేదికపై శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17, 18 తేదీల్లో ఏడుకొండల నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు పళ్లెంశెట్టి సురేష్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడుకొండలపై ఏడు సంవత్సరాలు, ప్రతి నెలా ఏడవ తేదీన 700 మంది కళాకారులతో, ఏడు రకాల భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో శ్రీవేంకటేశ్వరస్వామిని నీరాజనం అర్పించాలని తమ గురువైన కూచిపూడి నాట్యాచార్యుడు మునికుంట్ల సాంబశివ సంకల్పమన్నారు. తొలిసారిగా తిరుమలలో జాతీయ స్థాయిలో ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయికి 9 నెలల జైలు

వరదయ్యపాళెం: ఏడాది క్రితం వరదయ్యపాళెంలో ఆటో చోరీకి గురైన కేసులో ముద్దాయి మునిభూషణ్ (33)కు 9 నెలలు జైలుశిక్ష విధిస్తూ పుత్తూరు ఫస్ట్‌క్లాస్ సివిల్ కోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పును వెల్లడించారు. ఈ చోరీ కేసులో వరదయ్యపాళెం మండలం, నెల్లటూరుకు చెందిన మునిభూషణ్‌పై కేసు నమోదు చేసి, కోర్టు ఆధారాలతో సాక్ష్యాధారాలను మండల ఎస్‌ఐ నాగార్జునరెడ్డి అందజేశారు. పూర్తిస్థాయిలో కేసు విచారణ చేపట్టిన న్యాయమూర్తి గురువారం తీర్పును వెల్లడించారు.

ఆగస్టు 16 నుంచి సీపీఐ బస్సు యాత్ర

తిరుపతి కల్చరల్: ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 6వతేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ.జగదీష్, పీ.హరినాథరెడ్డి తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా నేత సీహెచ్ ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ ఒక్కడే 100 లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని దిగజార్చారని దుయ్యబట్టారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,160
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,493
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,500
రిటైల్ వెండి గ్రాము	రూ.77.50

నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు యోచన



అన్నప్రసాదానికి ప్రత్యేక పూజలు చేస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు

తిరుచానూరు(చంద్రగిరి): టీటీడీ స్థానికాలయాల్లో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు యోచిస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద గల అన్నప్రసాద భవనంలో రాత్రి వేళ కూడా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చైర్మన్ గురువారం రాత్రి ప్రారంభించారు. ముందుగా అన్నప్రసాద భవనంలో స్వామి, అమ్మవార్ల చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు రోజుకు రెండు పూటలా కలిపి దాదాపు ఒక లక్షా 30 వేల మందికి రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు. శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఎక్కువ మంది భక్తులు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానికి వస్తున్నారని, భక్తుల సౌకర్యార్థం 2007 నవంబర్ 22న ఇక్కడ అన్నప్రసాద వితరణ ప్రారంభమైందన్నారు. తోళప్ప గార్డెన్స్‌లోని అన్నప్రసాద భవనంలో ప్రస్తుతం రోజుకు 5 వేల నుంచి 6వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు ఇక్కడ అన్నప్రసాదాలు అందిస్తున్నారన్నారు. గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అదనంగా అన్నప్రసాదాలు అందించే ఏర్పాట్లు చేపట్టామని వివరించారు. స్థానికాలయాల్లో బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవాలు, రథసప్తమి, పుష్పయాగం, వసంతోత్సవాలు లాంటి పర్వదినాల సమయంలో భక్తులకు అన్నప్రసాదాలు అందజేస్తున్నామని చెప్పారు. దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో తిరుచానూరు అమ్మవారి పుష్కరిణి మరమ్మతులతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, మూరంశెట్టి రాములు, జేఈవో వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవోలు శ్రీ గోవిందరాజన్, శ్రీ సుబ్రహ్మణ్యం, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, తిరుపతి క్యాటరింగ్ అధికారి సాయిబాబారెడ్డి పాల్గొన్నారు.

టీటీడీకి నానో ఫర్టిలైజర్స్ వితరణ



పురుగు మందులను విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫర్టిలైజర్స్ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు నూతన ఉత్పత్తులైన నానో ఫర్టిలైజర్స్‌ను శ్రీవారికి వితరణగా అందించారు. తిరుమల పాపావినాశనం రోడ్డులోని టీటీడీ గార్డెన్ కార్యాలయం వద్ద గురువారం కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రయివేటు లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జీవీ.సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకర్ సుబ్రమణ్యం రూ.2.5 లక్షల విలువైన నానో డీఏపీ, ఆక్యూమిస్ట్ కాల్షియమ్, గార్డిన వంటి నానో ఫర్టిలైజర్స్‌ను టీటీడీ గార్డెన్‌డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు తమ కొత్త ఉత్పత్తులను మొదట శ్రీవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్లు సత్యనారాయణ, మాదబ్ అధికారి, హరీష్ మాత, మార్కెటింగ్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి సాదర వీడ్కోలు

రేణిగుంట: తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన అనంతరం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. సాయంత్రం 5.30గంటలకు ఆయన విమానాశ్రయానికి చేరుకుని తిరుగు పయనమయ్యారు. ఆయనకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఎన్‌హెచ్ఏఐ ఏపీ ఆర్వో రాకేష్‌కుమార్ సింగ్ తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

చీటీల వ్యాపారుల దౌర్జన్యాలపై ఫిర్యాదు

పలమనేరు: అధిక వడ్డీలు, అక్రమ ఫైనాన్స్‌లు, అనధికారిక చీటీల నిర్వాహకుల దౌర్జన్యాలు, బెదిరింపులు ఎక్కువయ్యాయని డీఎస్పీ సుధాకర్‌రెడ్డికి గంటావూరు కాలనీకి చెందిన పలువురు గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితులు సురేష్ తదితరులు మాట్లాడుతూ.. తమ కాలనీకి చెందిన మార్కొండ, పళని కొన్నేళ్లుగా అధిక వడ్డీలకు ఫైనాన్స్, అనధికారిక చీటీలను నిర్వహిస్తూ పేదల రక్తాన్ని పీల్చుతున్నారని తెలిపారు. వీరి కారణంగా ఈ ప్రాంతంలో చాలామంది అప్పులు పాలై గ్రామం విడిచి పోయారని పేర్కొన్నారు. ఇలాంటి వారి కారణంగా తనకు ప్రాణ హాని ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



మహిళా క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ సంతోషరావు



సరదాగా క్యారమ్స్ ఆడుతున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు వివిధ క్రీడల్లో నైపుణ్యాలను సాధించాలని ఆ సంస్థ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఆ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మహిళల కోసం ప్రత్యేకంగా క్రీడా ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. ఉద్యోగినులతో కలిసి సరదాగా క్యారమ్స్, చెస్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ వంటి క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. తదనంతరం ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న టెన్నిస్ కోర్టును పరిశీలించారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, లక్ష్మీనరసయ్య, వరకుమార్, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు గోపాలకృష్ణ, సూపరింటెండింగ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, రూపలత, వాసవీలత, చలపతి, అశోక్‌కుమార్, నరసింహబాబు, బాలాజీ, అమీర్ బాషా, రాజు పాల్గొన్నారు.

నాగరాజుకు అంబేడ్కర్ నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగరాజు

వరదయ్యపాళెం: కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, వరదయ్యపాళెం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పల్లిపట్టు నాగరాజుకు గుంటూరులోని దళిత ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డును ప్రకటించింది. గురువారం వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ఆచార్య కృపాచారి, చైర్ పర్సన్ డాక్టర్ స్వర్ణలత దేవి చేతుల మీదుగా నాగరాజు అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్యంలో నాగరాజు కృషికి అవార్డును అందజేశారు. అవార్డు గ్రహీతకు హైస్కూల్ ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

గాయపడిన వలంటీర్ మృతి



సతీష్(ఫైల్)

పిచ్చాటూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కడివేడు సచివాలయం, జానికాపురం వలంటీరు సతీష్(25) మృతి చెందాడు. ఈ నెల 9న ఆదివారం కారు–ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక వైపు కూర్చున్న వలంటీర్ సతీష్ తీవ్ర గాయలపాలై చెన్నైలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం



మహేశ్వరి (ఫైల్)

వెంకటగిరి రూరల్: తెలుగుగంగ కాలువలో మంగళవారం గల్లంతైన మహేశ్వరి (35) మృతదేహం గురువారం పెట్లూరు తెలుగుగంగ బ్రిడ్జివద్ద లభ్యమైంది. స్థానిక ఎస్ఐ నరసింహారావు కథనం.. వెంకటగిరి పట్టణంలోని రాణిపేటకు చెందిన వేముల మహేశ్వరి మంగళవారం ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాలువలో పడి గల్లంతైంది. రెండు రోజుల నుంచి అగ్నిమాపకశాఖ అధికారులు తెలుగుగంగ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం వెంకటగిరి రూరల్ మండలం, పెట్లూరు తెలుగుగంగ బ్రిడ్జివద్ద మహేశ్వరి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం మహేశ్వరి మృతదేహాన్ని ఆమె బంధువులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.